క్లుప్తంగా

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

శాయంపేట : ఈనెల 8వ తేదీన పరకాల కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీఐ రంజిత్‌రావు బుధవారం ప్రకటనలో తెలిపారు. వివిధ కేసుల్లో రాజీపడేవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆక్సిడెంట్, కొట్టుకున్న, తిట్టుకున్న, చీటింగ్, భూమి తగాదాల కేసులో రాజీపడాల్సిన వారు ఈనెల 8వ తేదీన పరకాల కోర్టులో జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఇరువర్గాలు కోర్టుకు హాజరై రాజీపడాలని పిలుపునిచ్చారు.

అధికారం శాశ్వతం కాదు



శాయంపేట : అధికారం ఎవరికీ శాశ్వతం కాదని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా యూత్ నాయకుడు బేరుగు రాకేశ్ అన్నారు. మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ మళ్లీ పుంజుకుని ఉవ్వెత్తున లేస్తుందన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, గెలిచినా, ఓడినా ప్రజల్లోనే ఉంటామన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి ఉద్యమాలు, పోరాటాలు కొత్త కాదని, దశాబ్ద కాలంగా పోరాడిన చరిత్ర కేసీఆర్‌కు ఉందన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఎన్నికల ముందు శాయంపేట మండలానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండలానికి ఆంబులెన్స్ ఏర్పాటు కోసం రూ.30లక్షల కేటాయించామని ఆరు నెలల నుంచి చెబుతున్నా అంబులెన్స్ కనిపించడం లేదని విమర్శించారు. ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ఆధ్వర్యంలో మండలంలోని సమస్యలపై, హామీల అమలుపై పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

బొగ్గు లారీ బోల్తా..

కాటారం: కాటారం–మంథని రహదారిపై ధన్వాడ సమీపంలో బుధవారం రాత్రి బొగ్గు లారీ బోల్తాపడింది. తాడిచర్ల నుంచి భూపాలపల్లి వైపుగా లారీ బొగ్గు లోడ్‌తో వెళ్తుంది. రహదారి నిర్మాణం పనులు కొనసాగుతుండటంతో లారీ డ్రైవర్ రహదారికి ఒక వైపుగా వెళ్లడంతో అదుపుతప్పి పడిపోయినట్లు స్థానికులు తెలిపారు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు తెలిసింది.

ఆత్మగౌరవ కవాతుకు తరలిరావాలి

దామెర : జూలై 7వ తేదీన వరంగల్ నగరంలో నిర్వహించతలపెట్టిన మాదిగల ఆత్మగౌరవ కవాతుకు మండలంలోని ప్రతి మాదిగబిడ్డ తరలిరావాలని ఎమ్మార్పీస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సుకుమార్ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో మండల ఇన్‌చార్జ్ గోవిందు సుకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఉద్యమ ఫలితంగా మాదిగలు నేడు సమాజంలో ఆత్మగౌరవంతో జీవిస్తున్నారని అన్నారు. ఎమ్మార్పీస్ 30ఏళ్ల పోరాటంలో సమాజంలో అన్ని వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అందాయని, మంద కృష్ణ మాదిగ నిర్వహించిన విశ్వరూప మహాసభను చూపి ప్రధాని నరేంద్ర మోదీ ఎస్సీ వర్గీకరణ చేస్తానని మాట ఇవ్వడం జరిగిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రానున్నందని, నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత మాదిగలకు ఇచ్చిన హామీని అమలు చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. మాదిగల ఆత్మగౌరవ కవాతు కోసం మండలంలోని అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిమళపాల్, గోవిందు కర్ణాకర్, అఖిలాష్, రాజు, మహేష్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు



కురవి: అనాథ బాలికకు అన్నీ తామై జిల్లా పోలీసులు బుధవారం మానవత్వం చాటుకున్నారు. పది రోజుల క్రితం మండల కేంద్రంలో తల్లిని కోల్పోయి అనాథగా మారిన బాలిక మానసకు కురవి పోలీసులు బాసటగా నిలిచారు. ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ ఆదేశాలతో అనాథ బాలిక తల్లి శశిరేఖ దశదిన కర్మకు సహపంక్తి భోజనాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. మానసకు మొదటి రోజు ఎస్సై గోపి పదిరోజులకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. మహబూబాబాద్ సీఐ సర్వయ్య బాలిక యోగక్షేమాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని బాసటగా నిలిచారు. అడిషనల్ ఎస్పీ చెన్నయ్య బాలిక ఇంటికి వచ్చి తల్లి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కురవి పోలీసులు ఏర్పాటు చేసిన సహపంక్తి భోజనాన్ని డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై గోపిలు ప్రారంభించారు. టీయుడబ్ల్యూయూ(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, పోలీసులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఏటూరునాగారం: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఏటూరునాగారం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అటవీశాఖ ఏటూరునాగారం సౌత్ రేంజ్ అధికారి అబ్దుల్ రెహమాన్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఏటూరునాగారం డివిజన్ ఆఫీస్ కాంప్లెక్స్ నుంచి బస్టాండ్ వరకు ఏటూరునాగారం సౌత్, నార్త్ అధికారులు, సిబ్బంది బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రెహమాన్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటుగా అడవులను రక్షించాలన్నారు. మొక్కలను నాటడానికి అటవీశాఖ ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. నీరు, భూమి, అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో నార్త్ రేంజ్ అధికారి బాలరాజు, డీవైఆర్ఓలు, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మొగుళ్లపల్లి: పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని మొగుళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ నాగరాణి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రలోని ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలను నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పర్యావరణం అంటే భూమి, గాలి, నీరు, జీవ జంతు జాతుల రూపంలో మన చుట్టూ ఉన్న ప్రకృతి అన్నారు. ఇది మానవ మనుగడకు, అభివృద్ధికి అంత్యంత అవశ్యకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ హెడ్యూకేటర్ రేష్మ, సూపర్‌వైజర్ సునీత, హెల్త్ అసిస్టెంట్ భిక్షపతి, సిబ్బంది సంపూర్ణ, జ్యోష్ణ, సరిత, కల్పన, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణకు కృషి చేయాలి

రేగొండ: ప్రకృతి పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ప్రజ్వల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ పీయూ మేనేజర్ బత్తుల శ్రీనివాస్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రజ్వల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో మండలంలోని కాకర్లపల్లి గ్రామంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే విధిగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తెలిపారు. నర్సింగాపురం గ్రామానికి చెందిన కంజుల లక్ష్మి స్వచ్ఛందంగా వేప, చింత, రేగు విత్తనాలతో సీడ్ బాల్స్ తయారు చేసి ప్రజ్వల్ ఫార్మర్ కంపెనీ వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి సునీల్, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దేవేందర్, రైతులు కొయ్యాడ సంజీవ, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



మహాముత్తారం: ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధిహామీ కూలీలు

మల్హర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీఓ శ్యామ్‌సుందర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని పెద్దతూండ్ల అమృత సరోవర్ ట్యాంకు దగ్గర బుధవారం ఎంపీడీఓ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవాళి పరిరక్షణకు ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ గిరి హరీష్, పంచాయతీ కార్యదర్శి సతీష్, ఫీల్డ్ అసిస్టెంట్ సంతోష్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మహాముత్తారం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఉపాధిహామీ సిబ్బంది మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏపీఓ కుమారస్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. అదే విధంగా ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణు, టీఏ ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ, ఉపాదిహామీ కూలీలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మొగుళ్లపల్లి: మొక్క నాటుతున్న వైద్యాధికారి నాగరాణి



రేగొండ: మాట్లాడుతున్న మేనేజర్ శ్రీనివాస్



మల్హర్: మొక్క నాటుతున్న ఎంపీడీఓ శ్యామ్‌సుందర్

పోగొట్టుకున్న పర్సు అందజేత



పర్సు, నగదు అందజేస్తున్న ఎస్సై సుధాకర్

భూపాలపల్లి అర్బన్: పట్టణంలోని వార సంతలో వారం రోజుల క్రితం పోగొట్టుకున్న పర్సును బాధితురాలికి బుధవారం అందజేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సుంకరి చంద్రకళ గురువారం సంతలో పర్సు పోగొట్టుకోగా అక్కడే విధులు నిర్వహిస్తున్న జితేందర్ పోలీస్ కానిస్టేబుల్ సంతలో వెతికి పర్సును కనిపెట్టినట్లు తెలిపారు. అట్టి పరుసులో రూ.16,500, ఏటీఎం కార్డ్, ఆధార్, పాన్‌కార్డు ఇతర విలువైన కార్డులు ఉన్నట్లు తెలిపారు. దీంతో బాధితురాలిని పోలీస్ స్టేషన్‌కు పిలిచి అందజేసినట్లు తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



బెల్లం పానకాన్ని పారబోస్తున్న సిబ్బంది

శాయంపేట : మండలంలోని సూర్యనాయక్‌తండా గ్రామంలో గల గుడుంబా స్థావరాలపై బుధవారం పరకాల ఎక్సైజ్‌శాఖ సీఐ తాతజీ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 700లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి, సిబ్బంది ప్రశాంత్, వరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన వసతులు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరుగైన వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరేళ్ల జోసఫ్ కోరారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి దేవరాజాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జోసఫ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల సమస్యలు పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులు భర్తీ చేసే విధంగా చర్యలు చేపట్టలన్నారు. ప్రైవేట్, కార్పోరేట్ కళాశాలల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించి, ప్రభుత్వ అనుమతి లేని కళాశాలల జాబితాను బహిర్గతం చేసి, నిబంధనలు పాటించని కళాశాలలపై చర్య తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కాసారబోయిన సిద్దు, ఇంధరపు అరవింద్, మాతంగి దిలీప్, భగవాన్, లావణ్య, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



రేగొండ: ఆర్థిక సాయం అందజేస్తున్న భిక్షపతి



చిన్నకోడెపాకలో పరామర్శిస్తున్న రాజుకుమార్

రేగొండ: మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన రొంటాల భద్రయ్య, గుంటోజు లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు కోలేపాక భిక్షపతి పరామర్శించి, ఒక్కో కుటుంబానికి రెండు వేల రూపాయలను ఆర్థిక సాయం అందజేశారు. వారి వెంట పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామల పాపిరెడ్డి, నాయకులు గుర్రాల సుమన్ రెడ్డి, గోగుల చంద్రారెడ్డి, గజ్జెల రామకృష్ణ, తడక శ్రీకాంత్, ఎడ్ల అనూష్‌రెడ్డి ఉన్నారు.

రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండలంలోని చిన్నకోడెపాక గ్రామానికి చెందిన సీపీఐ మండల సీనియర్ నాయకులు మార్క రామయ్య సతీమణి సరోజన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజుకుమార్ బుధవారం పరామర్శించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పైండ్ల శాంతికుమార్, గుంటి చంద్రమౌళి, సారయ్య, సమ్మయ్య రాజయ్య, వీరస్వామి, శ్రీనివాస్ ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేయండి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏపీఎం

శాయంపేట : మండలంలో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీధర్ రెడ్డి సూచించారు. మండలంలోని పత్తిపాక గ్రామంలో గల బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి అయ్యాయని, వర్షం కారణంగా శాయంపేట మండలంలో అలస్యమైనట్లు తెలిపారు. రైతులు ధాన్యాన్ని ఆరబోసి మ్యాచర్ శాతం తక్కువ ఉండేలా చూడాలని రైతులకు సూచించారు. ఆయన వెంట సీసీ విజయ్‌కుమార్, ఏఈఓ అర్చన, రైతులు ఉన్నారు.

బాలవికాస సేవలు అభినందనీయం

నర్సంపేట రూరల్ : బాలవికాస సేవలు అభినందనీయమని నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు పుచ్చకాయల కృష్ణారెడ్డి, బాలవికాస ప్రతినిధి సంపత్ అన్నారు. నర్సంపేట మండలంలోని రామవరం గ్రామంలో వాటర్‌ప్లాంట్ సభ బుధవారం ప్లాంట్ అధ్యక్షుడు జినుకల రజనీకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో గ్రామాల్లో బాలవికాస వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తుందని అన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జినుకల నర్సింహారాములు, ఉపాధ్యక్షుడిగా జినుకుల కిరణ్, ప్రధాన కార్యదర్శిగా జినుకుల రజనీకుమార్, సహాయ కార్యదర్శిగా అశోక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నాలుగు రోజులైనా ఉండేనా?



ఇటీవల పోసిన రామన్నగూడెం- ఏటూరునాగారం తారు రోడ్డు



పెచ్చులుడుతున్న రోడ్డు

- నాసిరకంగా రోడ్డు నిర్మాణం
- పట్టించుకోని అధికారులు

ఏటూరునాగారం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడాలని ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేస్తున్నాడు. దీంతో నిర్మించిన రోడ్డు నాలుగు రోజులైనా ఆగేనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఏటూరునాగారం నుంచి మంగపేట మండల కమలాపురం వరకు కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న తారు రోడ్డు పెచ్చులూడిపోతోంది. వాహనాలు నడుస్తుంటే తారు సైతం లేచిపోయి గుంతలుగా మారడంతో పాటు కంకర తేలుతోంది. మూడు ఇంచుల మందంతో పోయాల్సి తారు రోడ్డు కేవలం ఇంచున్నర మందంతో పోస్తుండడంతో వాహనాల రద్దీకి కేవలం నాలుగు నెలల పాటు కూడా ఉండే పరిస్థితి కనిపించడం లేదు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు సైతం ఈ రోడ్డు నిర్మాణంపై దృష్టి పెట్టకపోవడం బాధాకరం. పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టణాలకే పరిమితం కావడంతో కింది స్థాయి సిబ్బంది చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో నాలుగు కాలాల పాటు ఉండాల్సిన రోడ్డు నాలుగు రోజులకే ధ్వంసం అయ్యేలా ఉందని రామన్నగూడెం, ఏటూరునాగారం గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించి రోడ్డు నిర్మాణం పనులు నాణ్యతగా చేపట్టేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వాహన పత్రాలు లేకుంటే చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై సురేష్

కన్నాయిగూడెం: మండలంలో వాహనాలను నిబంధనలకు లోబడి నడపాలని, వాహన పత్రలు లేకుంటే చర్యలు తప్పవని స్థానిక ఎస్సై సురేష్ అన్నారు. మండలంలోని ఏటూరు వద్ద ప్రధాన రహదారిపై వాహన తనిఖీ చేశారు. ఏటూరు వద్ద రెండు ఇసుక క్వారీలు నడుస్తున్న సందర్భంలో నిత్యం లారీల రాకపోకలు నడుస్తున్నాయని వాహనదారులు రోడ్డు నిబంధనలకు లోబడి వాహనాలు నడపాలన్నారు. లేకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ర్యాష్ డ్రైవింగ్ చేసి ప్రమాదాలకు గురికావద్దన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తితే ఊరుకునేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

మావోయిస్టుల సమాచారం ఇవ్వండి



పోస్టర్లు అంటిస్తున్న ఎస్సై రవికుమార్

మంగపేట: మావోయిస్టుల సమాచారం ఇచ్చి నగదు బహుమతి పొందాలని ఎస్సై రవికుమార్ అన్నారు. మండలంలోని కమలాపురంలోని పలు ప్రాంతాల్లో మావోయిస్టుల ఫొటోలతో కూడిన వాల్ పోస్టర్లను పోలీసులు బుధవారం అతికించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విప్లవం పేరుతో సంఘవిద్రోహ శక్తులుగా మారి ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి అడ్డంకిగా మారి అమాయక గిరిజనుల ప్రాణాలను బలితీసుకుంటున్నారన్నారు. రెండు రోజుల క్రితం వాజేడు మండలంలోని కొంగాల అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ బాంబు పేలడంతో ఇల్లందుల యేసు మృతి చెందిన విషయం అందరికి తెలిసిందే అన్నారు. ఇదే విదంగా మరెందరో మావోయిస్టుల ఘాతుకాని బలయ్యారన్నారు. పోలీసులు అంటించిన పోస్టర్లలో ముద్రించిన మావోయిస్టుల సమాచారం ఇచ్చిన వారికి రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు నగదు బహుమతి అందిస్తామని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా పాఠ్య పుస్తకాలను పాఠశాల ఆవరణంలో అమ్ముతున్న వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి మహర్షి విద్యాలయం గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సభ్యుడు గుగులోతు సూర్యప్రకాశ్ డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలో అక్రమంగా పాఠ్యపుస్తకాలను అమ్ముతున్న మహర్షి విద్యాలయాన్ని బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. ఈసందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, టై, బెల్ట్, యూనిఫాం అమ్ముతూ తల్లిదండ్రుల నుంచి రూ.లక్షల సొమ్ము చేసుకుంటున్న పాఠశాలపై తక్షణమే చర్య తీసుకోవాలన్నారు. మానుకోట జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలపై విద్యాధికారులు స్పెషల్ రైడ్స్ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సింహాద్రి, రాజేష్, వినయ్, చరణ్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు



సంబురాలు నిర్వహిస్తున్న నాయకులు

నర్సంపేట : కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అత్యధిక పార్లమెంట్ స్థానాలు కైవసం చేసుకోవడం, తెలంగాణలో బీజేపీ 8 పార్లమెంట్ స్థానాలను గెలుచుకోవడంతో నర్సంపేట పట్టణంలో బీజేపీ నాయకులు బుధవారం టపాసులు కాల్చి విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, నియోజకవర్గ ప్రభారి అజ్మీరా కృష్ణవేణి, నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు, శ్రీనివాస్ ఉన్నారు.